# లావొక్కింతయు లేదు

**-వసుంధర**



**కథ**

**ఆవులిస్తే పేగులు లెక్కెడతాడని భాస్కర్రావుకు పేరు. అందుకని తెలిసినవారెవ్వరూ ఆయన ముందు ఆవులించరు. తెలియని వారి పేగులు లెక్కెట్టినా ప్రయోజనమేమిటని ఆయన వారిని పట్టించుకోడు.**

ఇప్పుడాయన కొత్తగా ఇల్లు కడుతున్నాడు. వాస్తును నమ్మడం వల్ల బడ్జెట్ అనుకున్న రేంజ్ దాటిపోయింది. బ్యాంకులు ఇంటికొచ్చి తలుపులు తట్టి మరీ అప్పులిస్తున్నాయనే ప్రచారముంది కానీ ఆయన మాత్రం అన్ని బ్యాంకుల తలుపులూ తట్టడం పూర్తి చేసి ప్రస్తుతానికి బంధుమిత్రుల ఇళ్ళ తలుపులు తడుతున్నాడు.

రెండంటే రెండు లక్షలు చేతికి చిక్కితే గృహప్రవేశం అయిపోతుందని ఆయన ఆశ. కానీ తలుపు తీసిన చుట్టాలూ, స్నేహితులూ ఆయనకు సలహాలే తప్ప ఒక్క పైసా ఇవ్వలేదు.

'లావొక్కింతయు లేదు' అని చేతులెత్తేసిన సమయంలో ఆయనకు సుబ్రహ్మణ్యం గురించి తెలిసింది.

ఓ ఏడాదిగా సుబ్రహ్మణ్యం రోజూ నిద్రలేవగానే ఆవులిస్తున్నాడన్నది జగద్విదితం. ఎందుకంటే ఆవులించినప్పుడు ఆయన చేసే శబ్దం భూనభోంతరాళాలను దద్దరిల్లజేస్తుంది. మొదట్లో ప్రళయనాదంలా వణికించిన ఆ శబ్దానికిప్పుడా ఊరివారు ఫ్యాక్టరీ సైరన్‌కిలా అలవాటు పడిపోయారు. కొత్త వాళ్లయితే ఇప్పటికీ సునామీ ఉత్పాతమా అని భ్రమ పడతారు.

సుబ్రహ్మణ్యం భార్య రేణుక భాస్కర్రావుకు దూరపు వరుసలో చెల్లెలవుతుంది. ఆ బంధుత్వాన్ని పురస్కరించుకుని ఆయనో రోజున వాళ్ళింటికెళ్ళాడు. అదృష్టం కొద్దీ ఆ సమయానికి ఇంట్లో రేణుక ఒక్కతే ఉంది.

“ఇల్లు కట్టుకున్నాను. నాకు చెల్లెళ్ళు లేరు. గృహప్రవేశానికి ఆడపడుచులు లేకుండా ఎలాగనుకుంటే నువ్వు గుర్తుకొచ్చావు. పిలవాలనొచ్చాను” అంటూ ఆయన వేసిన బ్రహ్మాస్త్రానికి ఆమె పిచ్చుకగా మారిపోయింది. తర్వాత ఆయన చిన్నప్పుడు తామిద్దరరూ లేని అనుబంధాలను అప్పటికప్పుడు సృష్టించి చెబుతూంటే ఆమె నమ్మేసి తను ‘రక్తసంబంధం’లో సావిత్రిగా మారి ఆయనలో ఎన్టీఆర్‌ని చూసింది. అప్పుడాయన తనకొచ్చిన డబ్బు అవసరాన్ని యథాలాపంగా చెప్పినట్లు చెప్పి, “ఈ ఊళ్ళో నాకు ఇద్దరు స్నేహితులున్నారు. ఏమంటారో చూడాలి” అన్నాడు.

రేణుక వెంటనే, “మరి నన్ను లెక్కేసుకోలేదా?” అంది నిష్ఠూరంగా.

“అయ్యో..ఇంటి ఆడపడుచువి. నీకు తీసుకునే స్వతంత్రమే తప్ప ఇచ్చే హక్కు లేదు” అనేసాడు భాస్కరావు తనకా ఆలోచనే లేనట్లు.

రేణుక ఈ మాటలకు పూర్తిగా పడిపోయింది. “అన్నయ్యంటే నువ్వా అన్నయ్యవి. నాకు తోడబుట్టిన వాళ్ళు ఇద్దరున్నారు. ఇద్దరికిద్దరూ నా నుంచి డబ్బు లాగాలని చూసేవాళ్ళే తప్ప నీకులా ఎప్పుడూ ఆలోచించలేదు. మావారిచేత యాభై వేలు ఇప్పించలేకపోయానని వాళ్ళు కొన్నాళ్ళు నాతో మాట్లాడ్డం మానేసారు కూడా” అంది.

“ఇవ్వడానికి మీవారి దగ్గర ఉండాలిగా” అన్నాడు భాస్కరావు లంకగుట్టుకోసం.

అంతే- ఆయన ఆశించినట్లే రేణుక విభీషణుడైపోయి, “చేసేది గవర్నమెంటు ఉద్యోగమే అయినా ఆయన జీతం మీద ఆధారపడే మనిషి కాదు. అదేమిటో ఆయన పట్టిందల్లా బంగారమే అవుతుంది. పేకాడతారా- వందలకు వందలు. షేర్లు కొంటారు- వేలకు వేలు. ప్లాట్లు కొంటారు-లక్షలకు లక్షలు. ఇంకా డబ్బుల్ని వడ్డీకి తిప్పుతారు- ఒక్క పైసా పోదు” అంది.

భర్తకు ఎన్ని రకాల ఆదాయాలున్నాయో వివరిస్తున్న ఆమెను మధ్యలో ఆపి, “అదంతా బావ ప్రతాపమేననుకుంటున్నావా- నీతో బావ దశ తిరిగింది. పెళ్ళికి ముందు ఆయనది పేకాటలో లూజింగు హ్యాండూ, బిజినెస్సులో ఐరన్ లెగ్గూనూ-తెలుసా?” అన్నాడు భాస్కరావు.

రేణుక చలించిపోతూ, “నామీద ఇంత అభిమానం నీకు. మరి నేను నీకేం చేయగలను? అప్పిప్పిద్దామన్నా చెల్లెలి సొమ్ము ముట్టనన్నావుకదా!” అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

“అబ్బే- ఆ మాట బావ వడ్డీ వ్యాపారం చేస్తాడని తెలియక అన్నాను. ఆయన నాకు అప్పిస్తే మామూలుగా అందరూ ఇచ్చే దానికంటే హెచ్చు వడ్డీ ఇస్తాను. ఆ ఎక్స్ట్రా మాత్రం ఆయన నీకిస్తానని మాటివ్వాలి” అన్నాడు భాస్కరావు ఆమెకు హామీ ఇస్తున్నట్లుగా.

రేణుక ఇంకా కరిగిపోయింది కానీ ఆమె దుఃఖం మాత్రం తరగలేదు, “అదంతా ఆయన నా మాట విన్నప్పుడు కదా? నన్నింతగా ప్రేమించే అన్నయ్యను అవసరానికి అప్పిచ్చి ఆదుకోలేకపోవడం నా దురదృష్టం ” అంటూ ఆమె మళ్ళీ కళ్ళనీళ్ళు పెట్టుకుంది.

“నిన్ను పెళ్ళాడి ఇంతవాడైన మీ ఆయన నీ మాట వినడా? వినకపోతే నేనూరుకుంటానా?” అన్నాడు భాస్కరావు సమస్య ఆమెదైనట్లు ఆవేశం నటిస్తూ.

“నేను తెలివితక్కువగా అందరి మాటలూ నమ్మేస్తానట. పొగడ్తలకు పడిపోతానట. అందుకని నేను రికమెండు చేస్తే మావారు అప్పివ్వరు” అంది రేణుక జాలిగా.

‘సుబ్రహ్మణ్యం ఘటికుడే’ అనుకున్నాడు భాస్కరావు. ఆయన రేణుకతో, “ఊరికే కలవరపడకు. నేను బావ దగ్గర అప్పు తీసుకుని హెచ్చువడ్డీని నీకు కానుక చేస్తాను. మరి బావ ఎలాటివాళ్ళకు అప్పలిస్తాడో కాస్త చెబుతావా?” అన్నాడు ఆత్మీయంగా.

రేణుకు ఆయనకు భర్త స్వభావాన్ని వివరించి, “నా బంధువులకు వారు కుంటిసాకులు చెప్పి పంపేస్తారే తప్ప ఏ సాయమూ చెయ్యరు” అంది.

“నేను అవులిస్తే పేగులు లెక్కెడతాను. కుంటిసాకులు మన దగ్గర సాగవు” అంటూ భాస్కరావు ఆమెకు మళ్ళీ హామీ ఇచ్చాడు.

“ఐతే సిద్ధంగా ఉండు. మా వారు రోజుకొక్కసారే ఆవులిస్తారు. అదీ నిద్రలేచినప్పుడు” అంది రేణుకు అమాయకంగా.

కాసేపటికి ఆఫీసు నుంచి సుబ్రహ్మణ్యం, కాలేజీలనించి పిల్లలు ఇంటికొచ్చారు. భాస్కరావు మాటలతో అందర్నీ మెప్పించాడు. సాధారణంగా దేనికీ నవ్వని సుబ్రహ్మణ్యం భాస్కరావు జోకులకు పడిపడి నవ్వుతూంటే రేణుక, పిల్లలు ఆశ్చర్యపడి తామూ నవ్వారు.

“మా రేణుకవైపు వాళ్ళకి బొత్తిగా సెన్సాఫ్ హ్యూమర్ లేదు. పిల్లలదీ అటు పోలికే. నువ్వు తన తరఫంటే నమ్మలేకుండా ఉన్నాను” అన్నాడాయన భాస్కరావును మెచ్చుకుంటూ.

“రేపు కూడా నన్ను మీరిలాగే మెచ్చుకుంటే నాకు మరింత సంతోషం” అన్నాడు భాస్కరావు నర్మగర్భంగా.

భాస్కరావు అంతర్యం తెలియని సుబ్రహ్మణ్యం “రేపే కాదు-ప్రతి రేపుకీ నీకు నా మెప్పులభిస్తూనే ఉంటుంది” అన్నాడు తనూ నర్మగర్భంగా.



## మహిమాన్వితం

ఎప్పుడూ ఉండే సినిమా షూటింగ్‌లు, మీడియా విసిరే రూమర్ల బాణాలకు దూరంగా ఉండాలనుకుంటోందిట మహిమా చౌదరి. అందుకేనేమో ఇప్పుడు తన లైఫ్ స్టయిల్‌ని కూడా మార్చేసుకుంది. మహిమా ఇప్పుడు వెజిటేరియన్‌గా మారిపోయింది. ఈ ఫుడ్ ఆరోగ్యాన్ని ఎంతగానో కాపాడుతుంది. అంతేకాదు మన ఎమోషన్స్‌ని కూడా అదుపులో ఉంచుతుంది అని చెప్పే మహిమా ఎక్కడికి వెళ్లినా మెనూలో వెజిటేరియన్ కర్రీస్‌కే ప్రాధాన్యత ఇస్తోంది. ఎంతమారిపోయిందో మహిమ అంటున్నారంతా.

## కావాలని చేయడంలేదు

తారల ఆలోచనలు ఎప్పటికప్పుడు మారుతూంటాయి. ఎప్పుడూ గ్లామర్‌కి పెద్ద పీట వేసే బాలీవుడ్ భామ బిపాషాబసు కొత్త మాటలు నేర్చుకుంది. 'సినిమాల్లో పాత్రల తీరుని బట్టి మన వేషభాషలుండాలి. అలా లేనప్పుడు ప్రేక్షకులు ఆ పాత్రల్ని ఆమోదించరు. అందుకేనేను కొన్ని పాత్రల స్వభావానికి అనుగుణంగా నటిస్తుంటాను. అందుకే ఒకోసారి నేను సెక్సీగా కన్పిస్తాను. కావాలని నేనేమీ ఎక్స్‌పోజింగ్ చేయడం లేదు' అంటోంది. ఇప్పుడు గ్లామర్‌తో పాటూ యాక్షన్, సెంటిమెంట్ పాత్రలకి కూడా గుర్తింపునిస్తోందీ భామ. ఈమె ఆలోచనా సరళి ఎవ్వరికీ ఆసక్తి కలిగించడం లేదు.



భాస్కర్రావు బ్రహ్మానందపడిపోయాడు. సుబ్రహ్మణ్యం తన బుట్టలో పడినట్లేనని భావించిన ఆయనకు ఆ రాత్రి కమ్మటి నిద్ర పడితే అందులో తీయని కలలు! సుబ్రహ్మణ్యం ఆయనకు ఆగకుండా అప్పులిచ్చేస్తుంటే-ఆయన ఆగకుండా ఇంద్రభవనాల్లాంటి ఇళ్ళు కట్టించేస్తున్నాడు.

పదమూడో ఇల్లు కటిస్తూండగా కాబోలు ఒక్కసారి భూమి కంపించి భూనభోంతరాళాలు దద్దరిల్లాయి. భాస్కర్రావు కట్టించిన ఇళ్ళన్నీ నేలమట్టమైపోయాయి. ఆయన ఉలిక్కిపడి లేచి కూర్చుని కళ్ళు నులుముకుని చూస్తే ఎదురుగా రేణుక కనిపించి, "నువ్వు కంగారు పడతావేమోనని చెప్పడానికొచ్చాను. వారిప్పుడే ఆవులించారన్నయ్యా!" అంది.

సుబ్రహ్మణ్యం ఆవులించినప్పుడు తను పక్కన లేనే అని భాస్కర్రావు వాపోయాడు. ఆయన రోజుకొక్కసారే ఆవులిస్తాడు కాబట్టి పేగులు లెక్కట్టడానికి మళ్ళీ రేపటి దాకా ఎదురుచూడాలి. అప్పుడూ మిస్సైపోతానేమోనన్న భయంతో ఆ రాత్రికి సుబ్రహ్మణ్యం పక్క తన పక్కనే ఏర్పాటు చేయమని రేణుకను కోరాడతడు. భర్త ఒప్పుకుంటే అలాగే ఏర్పాటు చేస్తానందామె.

భాస్కర్రావా రోజంతా రేణుకను మాటల్లో పెట్టి సుబ్రహ్మణ్యం గురించి చాలా తెలుసుకున్నాడు.

సుబ్రహ్మణ్యం భోజన ప్రియుడు. లేచింది మొదలు నిద్రపోయేదాకా ఆయన నోరు గానుగాడినట్లు పనిచేస్తూనే ఉంటుంది. రెండేళ్ళ నుంచి ఆయన కాస్త లావెక్కుతున్నాడు. తిండి తగ్గించమని వాళ్ళూ వీళ్ళూ సలహాఇచ్చినా, "నాకు బీపీ లేదు, సుగరు లేదు. కాలూ చేయీ సక్రమంగా ఆడుతున్నాయి. తిన్నది నిక్షేపంలా అరుగుతోంది. నిద్ర బాగా పడుతోంది. తిండి ఎందుకు తగ్గించాలి?" అంటూ ఎదురు ప్రశ్నలు వేసి యథాప్రకారం తన అలవాటు కొనసాగిస్తున్నాడు. నిద్రలేస్తూనే భయంకరంగా ఆవులించడం ఏడాది క్రితం మొదలైంది.

బావ ఆయువుపట్టు దొరికినట్లే ఫీలయ్యాడు భాస్కర్రావు. ఆ రోజాయన బావకోసం బజార్నించి స్పెషల్ స్వీట్సు కొని తెచ్చాడు. ఆఫీసు నుంచి వచ్చి, "అసలే ఊరిపోతున్నాను. ఈ స్వీట్సెందుకు బావా" అంటూనే వాటినెంతో ఆప్యాయంగా తిన్నాడు సుబ్రహ్మణ్యం.

"నీ సమస్యకు పరిష్కారం నీ పేగుల్లో ఉంది. రేపు నువ్వు ఆవులించినప్పుడు నీ పక్కనే ఉండి దాన్ని కనుక్కుంటాను" అన్నాడు భాస్కర్రావు. సుబ్రహ్మణ్యం దాన్ని జోకుగా భావించి పడిపడి నవ్వితే, "అయాం సీరియస్! అందుకే ఈ రాత్రి నీ పక్కన నా పక్క వేయమని చెల్లాయిని రిక్వెస్టు కూడా చేసాను" అన్నాడు భాస్కర్రావు.

ఆ రాత్రి వాళ్ళిద్దరికీ పక్కలు ఒకే గదిలో ఏర్పాటయ్యాయి. భాస్కర్రావు ఆగకుండా హుషారుగా కబుర్లు చెబుతూంటే సుబ్రహ్మణ్యం, "బావా! టైము పది దాటితే నేనిక నిద్రకాగలేను" అన్నాడు. అదే ఆఖరి మాట.

భాస్కర్రావు చాలాసేపు ఆయన్నే చూసాడు. మెలకువలో పిప్పళ్ళ బస్తాలా కనిపించే ఆ మనిషి నిద్రపోతూంటే ఊపిరి పీల్చే శవంలా ఉన్నాడు. అంత వళ్ళుంటే అలాంటి సుఖనిద్ర పడుతుందా లేక అలా నిద్రపట్టడం వల్ల అంత వళ్ళొచ్చిందా అన్న సందేహం కలిగిందాయనకు. కాసేపటికాయన కళ్ళు మూతపడ్డాయి కానీ బావ ఆవులింత మిస్సైపోతానేమోనన్న భయంతో అది కలత నిద్రే అయింది.

తూరుపు తెలవారకుండానే లేచి కూర్చున్న భాస్కర్రావుకు ఎదురు చూసిన సమయం రానేవచ్చింది. సుబ్రహ్మణ్యానికి మెలకువ వచ్చి పెద్దగా ఆవులించి వళ్ళు విరుచుకుంటూ లేచి కూర్చున్నాడు. పక్కలో పది ఆటంబాంబులు పేలినట్లై భాస్కర్రావుకు స్పృహ తప్పింది. దాంతో పేగులు లెక్కపెట్టాలన్న ఆయన కోరిక తీరలేదు.

స్పృహ తప్పుతూండగా బావను చూసిన సుబ్రహ్మణ్యానికి కళ్ళు తిరిగినట్లై భార్యను పిలిచాడు. ఆమె వచ్చి ముఖాన నీళ్ళు జల్లితే సుబ్రహ్మణ్యం తేరుకున్నాడు కానీ భాస్కర్రావుకు స్పృహ రాలేదు. రేణుక డాక్టరుకి ఫోన్ చేసింది.

డాక్టరు వచ్చి భాస్కర్రావును పరీక్షించి, "మనిషి నార్మల్‌గానే ఉన్నాడు. ఏదో పెద్ద షాక్ తగిలి మెదడు తాత్కాలికంగా మూగవోయింది. సాయంత్రంలోగా స్పృహ రాకపోతే ఫీడింగుకు హాస్పిటల్లో జాయిన్ చెయ్యాలి" అన్నాడు.

అప్పుడు సుబ్రహ్మణ్యం డాక్టరుతో, "ఈరోజు నాకు మొదటిసారిగా కళ్ళు తిరిగాయి. నడుస్తూంటే ఆయాసంగా కూడా అనిపిస్తోంది. ఏమిటంటారు?" అన్నాడు.

డాక్టరాయన్ను పరీక్షించి, "మీకే జబ్బూ లేదు. వళ్ళు తగ్గాలంతే!" అనేసి వెళ్ళిపోయాడు.

"వళ్ళు తగ్గాలిట. అందుకేం చేయాలో?" అన్నాడు సుబ్రహ్మణ్యం భార్యవంక చూస్తూ.

తిండి తగ్గించమని చెబితే తిడతాడని, "నాకేం తెలుస్తుంది? మీ పెదనాన్నగారబ్బాయి గణపతి సన్నగా రివటలా ఉంటాడు. ఆయనకు ఫోన్ చెయ్యండి" అంది

రేణుక.

సుబ్రహ్మణ్యం గణపతికి ఫోన్ చేస్తే, "సన్నబడాలంటే నువ్వు రోజుకి పది మైళ్ళు పరిగెత్తు" అన్నాడాయన.

"మరి నువ్వు నాకు తోడుగా వస్తావా?" అనడిగాడు సుబ్రహ్మణ్యం.

"అయ్యో- స్కూటరు లిఫ్టు దొరక్క నేను మా పొరిగింటికి వెళ్ళే పదిరోజులైంది. నేనేం పరుగెడతాను?" అన్నాడు గణపతి.

"మరి నీ వల్ల కానిది నాకెందుకు చెప్పావు?" చిరాగ్గా అడిగాడు సుబ్రహ్మణ్యం.

"నాది పిట్ట తిండి. కాబట్టి ఏ వ్యాయామం లేకపోయినా సన్నగా ఉన్నాను. మన వీరభద్రం సంగతి అలా కాదు కదా- వాడికిదే సలహా ఇచ్చాను మరి" అని ఫోన్ పెట్టేసాడు గణపతి.

వీరభద్రం కూడా భోజన ప్రియుడు. అతడూ సన్నగానే ఉంటాడు. పరుగుకు తనకు తోడొస్తాడేమోనని అడగడానికాయన వీరభద్రానికి ఫోన్ చేసాడు.

"వన్డే క్రికెట్లో మెరుపువేగంతో పరుగులు తీసే అర్జున రణతుంగాకు పెద్దబొజ్జ ఉంది. హీరోయిన్లచేత చలాకీ గెంతులు వేయించే డాన్స్‌మాస్టర్ సరోజ్‌ఖాన్ పిప్పళ్ళబస్తాలా ఉంటుంది. వ్యాయామంతో వళ్ళు తగ్గదు. తిండి తగ్గించాలి. నా మాట విని నువ్వు రోజూ పొద్దున్నే లేచి నూటయాభై వేపాకులు నములు. భోజనంలో రోజూ కాకరకాయ కూర తిను. మంచినీళ్ళకు బదులు రాగుల జావ తాగు. అన్నానికి బదులు జొన్నరొట్టెలు తిను. ఆకు కూరలు బాగా కడుక్కుని పచ్చివే తిను. నెలకు పది కేజీల చొప్పున తగ్గిపోతావు" అన్నాడు వీరభద్రం.

"ఇవన్నీ చేయమంటే మా ఇంట్లో ఒప్పుకోరు. ఎలాగూ మీ యింట్లో చేస్తారు కాబట్టి పనిలో పనిగా నాక్కూడా తయారు చేయించు. కలిసి పాటిద్దాం" అన్నాడు సుబ్రహ్మణ్యం.


"ఛా..నేను చావనైనా ఛస్తాను కానీ అలాంటి తిండి తినలేను" అన్నాడు వీరభద్రం.

"మరి నీవల్ల కానిది నాకెందుకు చెప్పావు?" చిరాకు పడ్డాడు సుబ్రహ్మణ్యం.

"నాది పాముపొట్ట. కాబట్టి ఏం తిన్నా సన్నగానే ఉంటాను. మన సత్యం సంగతి అలా కాదుకదా..వాడికిదే సలహా ఇచ్చాను మరి" అని ఫోన్ పెట్టేసాడు వీరభద్రం.

సత్యం ఆ మధ్య బాగా వళ్ళు చేసి ఇటీవల మళ్ళీ సన్నగా అయ్యాడు. సుబ్రహ్మణ్యం ఆయనకీ ఫోన్ చేసాడు.

"నువ్వు బ్యూటీ క్లినిక్కులో చేరు. వాళ్ళు గ్రాముకి రూపాయ చొప్పున తీసుకుని నీ బరువు తగ్గిస్తారు. అంటే కేజీకి వెయ్యి రూపాయలన్నమాట! నువ్వు




వ్యాయామం చెయ్యక్కర్లేదు. తిండి మానక్కర్లేదు. బాగుంది కదా!" అన్నాడు సత్యం.

"మరి నీకు మొత్తం ఎన్ని వేల రూపాయలైంది?" అడిగాడాయన కుతూహలంగా.

"వెయ్యి రూపాయలు" చెప్పాడు సత్యం.


"అంటే నువ్వు ఒక కేజీ బరువు తగ్గగానే ఆపేసావన్నమాట. కానీ నిన్ను చూస్తే చాలా కేజీలు బరువు తగ్గేవనిపిస్తుందే!" అన్నాడు సుబ్రహ్మణ్యం.

"నేను వేలకు వేలు బ్యూటీ క్లినిక్కులో పోస్తానా? నాకు థైరాయిడ్ ప్రాబ్లం ఉండి బరువు పెరిగాను. డాక్టరు ఫీజుకి, చికిత్సకీ కలిపి వెయ్యి రూపాయలు ఖర్చు చేస్తే మళ్ళీ సన్నబడిపోయాను. బ్యూటీక్లినిక్ వివరాలు కావాలంటే నీకు కన్నబాబు చెబుతాడు" అన్నాడాయన.

సుబ్రహ్మణ్యం ఫోన్ చేయగానే కన్నబాబు నేచరోపతీ గురించి చెప్పి వివరాలకు కామరాజు నడగమన్నాడు. కామరాజు గణపతి పేరు చెప్పాడు. కథ మళ్ళీ మొదటికొచ్చింది.

ఏం చేయాలా అని సుబ్రహ్మణ్యం తలపట్టుకునేసరికి భాస్కర్రావుకు స్పృహ వచ్చింది. ఆయన కళ్ళు తెరిచేక, "ఏం ఆవులింత బావా నీది! ఆవులిస్తే పేగులు పెక్క పెట్టేవాళ్ళ పప్పులు నీ దగ్గర ఉడకవు" అన్నాడు.

"ఆయన ఆవులింత సంగతలా ఉంచు. నీకు స్పృహ తప్పేసరికి ఎన్నడూ జిర్రున చీది ఎరుగుని ఆయనకు కళ్ళు తిరిగి ఆయాసమొచ్చింది. డాక్టర్నడిగితే వళ్ళు




తగ్గించుకోమన్నాడు. అప్పట్నించీ ఆయన ఒకటే ఫోన్లు" అంటూ రేణుక ఆయనకు జరిగినదంతా చెప్పింది.

భాస్కర్రావు నవ్వుతూ, "పుష్టికీ లావుకీ తేడా లేదా బావా? డాక్టరు నీకే జబ్బూ లేదన్నాడు. అడిగావు కదా ఏదో చెప్పాలని వళ్ళు తగ్గాలన్నాడు కానీ నీకు టెన్షనలైనా సజెస్ట్ చేయలేదు. దున్నపోతు ఈనిందంటే దూడను కట్టేయమన్నట్లు నువ్వేమిటి బావా-డాక్టరలా అనగానే అన్ని ఫోన్లు కొట్టావు? నేను లేచేదాకానైనా కాస్త ఆగాల్సింది" అన్నాడు.

సుబ్రహ్మణ్యం తడబడుతూ, "ఐతే నేను లావు కాదంటావా? మరి నాకీ రోజు కళ్ళు తిరిగాయేం? ఆయాస మొచ్చిందేం?" అన్నాడు అనుమానంగా, ఆశగా.

"నీ మనసు సున్నితం. మొదటిసారిగా దగ్గర్నుంచి నీ ఆవులింత వింటే భయంతో నేనెలా షాక్ తిన్నానో, అలాగే మొదటిసారిగా నీ ఆవులింతకో మనిషి స్పృహతప్పితే నీ మనసు తట్టుకోలేకపోయింది. ఇప్పుడు నాకు స్పృహొచ్చిందిగా..నీకు కళ్ళు తిరగవు. నడిస్తే ఆయాసం రాదు" అన్నాడు భాస్కర్రావు.

సుబ్రహ్మణ్యం కాసేపటూ ఇటూ తిరిగి, "నువ్వు చెప్పింది నిజమే బావా! కానీ ఇదంతా ఎలా ఊహించావోనని ఆశ్చర్యంగా ఉంది" అన్నాడు.

భాస్కర్రావు గర్వంగా నవ్వి, "చాలా సింపుల్! ఈ రోజు కూడా భూనభోంతరాళాలను దద్దరిల్లజేసేలా ఆవులించి రవంత కూడా ఆయాసపడలేదు నువ్వు. అంటే నీకు లావెక్కింతయు లేదు. దగ్గర కాస్త డబ్బు చేరినవారందరిలాగే కాస్త పుష్టిగా ఉన్నావంతే! కాబట్టి నీ ఆయాసానికి కారణం నీ సున్నితమైన మనసనుకున్నాను" అన్నాడు.

"నీ రాక నా మనసుకెంతో తృప్తినిచ్చింది. నువ్వు మా యింటికి రావడం మా అదృష్టం" అన్నాడు సుబ్రహ్మణ్యం పొగడ్తలకు పొంగిపోతూ.

అది అవకాశంగా తీసుకున్న రేణుక వెంటనే భాస్కర్రావు వచ్చినపని చెప్పింది. ఆయన చలించిపోయి, "డబ్బు కోసం ఈ ఊరొచ్చి-ఇవ్వగలిగిన నన్నడక్కూడదనుకున్నావా? నీ చెల్లికి ఎంత హెచ్చు వడ్డీ ఇచ్చుకుంటావో అది నీ యిష్టం. నేను మాత్రం మామూలు వడ్డీనే తీసుకుని నా మనసు సున్నితమని మరోసారి ఋజువు చేసుకుంటాను" అన్నాడు ఆవేశంగా.

లావెక్కింతయు లేని స్థితిలో ఉన్న భాస్కర్రావు లావుగా ఉన్న సుబ్రహ్మణ్యంను లావెక్కింతయులేదు అనడంలో ఆవులింతకూ, పేగులకూ సంబంధముందో లేదో కానీ భాస్కర్రావుకు వచ్చిన పని అయింది.